# కృతజ్ఞత

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"ఏప్రిలు 6 న పెట్టిన మీ దరఖాస్తు అందింది. మే 2 న ఉదయం పదిగంటలకు మా ఆఫీసుకు వచ్చి మా జనరలు మేనేజరును కలవండి."

రమణయ్య ఈ ఉత్తరాన్ని అదివరకే అనేక వందల సార్లు చదివి కంఠస్థం చేసుకున్నాడు. అయినా వేళంకాని వేళంలో, దారిద్ర్యంఅట్టడుగు చూస్తున్న రమణయ్య చాలా జాగర్తలు పడవలసిఉంది. ఆ ఉత్తరాన్ని జేబుదొంగలు కొట్టెయ్యవచ్చు. లేదా జేబులోకనపడని చిల్లిఉండి అందులోనుంచి అది జారిపడిపోవచ్చు. ఏ గారడీగాని జరిగి ఆ ఉత్తరం బదులు జేబులో మరొకఉత్తరం ఉండవచ్చు. లేదా, ఆ ఉత్తరంలో తాను చదివిన అక్షరాలు తారుమారైపోయి, "మీకు మా ఆఫీసులో ఉద్యోగాలు లేవు ఇంకెక్కడన్నా చూసుకోండి" అన్న ముక్కలు అందులో ప్రత్యక్షం కావచ్చు. అందుకని ఆ ఉత్తరాన్ని రెండునిమిషాల కొకసారి వేళ్లతో తడిమి చూసుకోవటమూ, అయిదునిమిషాల కొకసారి పైకితీసి విప్పి చూసుకోవటమూ రమణయ్య ప్రాణానికి అత్యవసరం

ఈ ఉత్తరం రాసిన కంపెనీ ఇదేనా? ఇదే! ఇవాళ రెండేనా? ఆహా! సంవత్సరం గాని మారలేదు గద? లేదు! ఇంకా పది గంటలు కాలేదా? ఎదురుగా ఉన్న గడియారాన్ని నమ్మాలా పోయిన పెట్టుకోవచ్చునా? తొమ్మిదిన్నరే అనుకోవాలి అది ఆగిపోలేదు గద? పొరపాటున పదిన్నరో పదకొండో అయిందనుకో, ఇంత ఆలస్యంగా వచ్చావేమని వీళ్ళ జనరలు మేనేజరు కర్ర ఎత్తితే?

రమణయ్యను కూర్చోమని కుర్చీ చూపి పోయిన సిపాయికుర్రాడు మళ్ళీ ఐపు లేడు పదిగంటలు కొట్టేసరికి జనరలు మేనేజరు వస్తారని చెప్పాడు. వాడికి రమణయ్య తన జేబులో ఉన్న ఉత్తరం చూపాడు కూడాను

ఒకటకా బూట్సుచప్పుడు వినిపించింది ఎవరో ఒక పొట్టిమనిషి వచ్చాడు. ఎందుకైనా మంచిదని రమణయ్య అనుమానిస్తూ నిలబడ్డాడు. ఆయన రమణయ్యకేసి చూడకుండా పక్కగా వెళ్లిపోయినాడు రమణయ్య మళ్లా కూచోబోతుండగా ఆయన వెనక్కు తిరిగి, తెలుగులో - చక్కని గుంటూరుజిల్లా భాషలో! - "రమణయ్యగారు కాదూ?" అంటూ వెనక్కు వచ్చాడు

రమణయ్య హృదయం మిఠాయి చూసిన పిల్లాడల్లే గంతులు వెయ్యసాగింది.

"మీరెవరో—" అన్నాడు రమణయ్య విశాలంగా నవ్వుతూ

"నన్ను మీరు మరిచి ఉంటారు మీవల్ల మహోపకారం పొందినవాణ్ణి కనక నేను మిమ్మల్ని జన్మలో మరవలేను నేనిప్పుడు ఈకంపెనీకి జనరలు మేనేజరుగా ఉంటున్నాను మా ఆఫీసుకు పోదాం రండి!"

రమణయ్య ఎన్నడూ తాగినవాడు కాడు. కాని ఆక్షణంలో ఆయన బాగా తాగినవాడల్లేనే ఉన్నాడు అయితే ఆసంగతి ఆయనకు తెలీదు

జనరలు మేనేజరు ఆఫీసుగది స్వర్గం మల్లేనే కనిపించింది. రమణయ్యకు గదిలోకి రాగానే చల్లగా ఉన్నది. అద్దాలు పరిచిన బల్లా, తళతళా మెరిసే కుర్చీలూ, అందమైన పేపరు వెయిటులూ—వర్ణనాతీతంగా ఉంది

"నాపేరు సోమయాజులు మీరు నాపేరు ఎరగరు నేను అతి దౌర్భాగ్యస్థితిలో ఉండగా మీరు నాకు—నేనెవరో తెలీకుండానే, నేను తిరిగి ఇస్తా నన్న నమ్మకం లేకుండానే రెండురూపాయలు ఒదులిచ్చారు ఆరెండు రూపాయలూ నా జాతకం మార్చివేశాయి. ఇందులో ఏమీ అతిశయోక్తిలేదు నేనివాళ ఈ కుర్చీలో కూర్చుని పన్నెండు వందలు సంపాదిస్తున్నానంటే అది మీ చలవే!"

రమణయ్య నవ్వటం తప్ప ఇంకేమీ అనలేకపోయినాడు

"మీరు పెట్టిన దరఖాస్తు చూశాను. కాని మీరే అని అనుమానం రాలేదు. ఎంతమంది రమణయ్యలుంటారు! మీరు ఇంటర్వ్యూకోసం వచ్చిఉంటారు. నాకు ఇంత మహోపకారంచేసినవాడికి నేనీ పాడు ఉద్యోగం ఇవ్వలేను, ఇవ్వను. అది తలాపెట్టరాదు. ఇంతకంటె మంచిఉద్యోగం చూడండి"

సోమయాజులు మౌనం వహించటం చూసి రమణయ్య ఆయన చెప్పబోయే శుభవార్తకోసం నిరీక్షించసాగాడు

అయిదునిమిషాలయింది

"నా సంగతి—" అన్నాడు రమణయ్య

"మంచిది మీరు వెళ్లిరండి ఉద్యోగం దొరికినసంగతి నాకు ఫోనుచెయ్యండి"

రమణయ్య తన చెవులను నమ్మలేకపోయినాడు. ఆయన మొహాన రక్తం లేకుండా పోయింది.

"అన్నట్టు, ఇవిగో మీ రెండురూపాయలు! ఎవరు చూశారు? ఈ రెండు రూపాయలు మీకు ఎంత అదృష్టమైనా తీసుకు రావచ్చు."

బయటికి నడిచేటప్పుడు రమణయ్య కాళ్లు లోడీలలాగా ఉన్నాయి.

---

**కుష్ఠు ★ బొల్లి**

సెగ్గిరా పేహామచ్చలు, సెగ, సవాయివ్యాధులకు, గ్యారంటీచికిత్స కేటలాగు ఉచితం.
జి వి రెడ్డి అండ్ కో, "భాస్కరాశ్రమము"
గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా